నమస్తే తెలంగాణ
నాగర్‌కర్నూల్
5 | మహబూబ్‌నగర్, శనివారం 28 డిసెంబర్ 2024 | NAGARKURNOOL

'ఇసుకా.. ఇసుకా.. ఎందుకు తరలు తున్నావంటే.. మామూళ్లకు కక్కుర్తిపడే అధికారులు ఉంటే తరలనా'.. అందంట. నారాయణపేట జిల్లాలో పరిస్థితి అలా తయారైంది. చీకటి పడిందంటే చాలు ఇసుక మాఫీయా రెచ్చిపోతోంది. కృష్ణానదితో పాటు మాగనూరు పెద్దవాగు నుంచి గుట్టుచప్పుడు కాకుండా టిప్పర్లు,ట్రాక్టర్లలో జోరుగా తరలిస్తున్నారు. నిత్యం 20 నుంచి 30 టిప్పర్ల వరకు తోడేస్తున్నారు. అధికారులకు సమాచారం అందించినా స్పందించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. రోడ్లపై బాజాప్తా ఇసుక వాహనాలు వెళ్తున్నా పోలీస్ శాఖ పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తు తున్నాయి. ఇదంతా అధికారుల కనుసన్నల్లోనే జరుగుతుందని రైతులు ఆరోపిస్తున్నారు.

– నారాయణపేట, డిసెంబర్ 27

రీచ్‌ల వద్ద నైట్ డ్యూటీలు వేశాం

మాగనూరు మండలంలో గుర్తించిన ఇసుక రీచుల వద్ద ఇసుకను అక్రమంగా తరలించకుండా ఎస్ఆర్ఏలకు నైట్ డ్యూటీలు వేశాం. పోలీసులు కూడా మా ఎస్ఆర్ఏలకు తోడు ఉండేలా చూడాలని ఎస్సైకి తెలిపాం. మాగనూరు శివారులో ఉన్నవాగు పరీవాహక ప్రాంతాల వారు ఇసుక అక్రమ తరలింపునకు పాల్పడుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. తరలించకుండా బందోబస్తు ఏర్పాటు చేయించాం.

–సురేశ్‌కుమార్, ఇన్‌చార్జి తాసీల్దార్, మాగనూరు

- 'పేట' జిల్లాలో జోరుగా ఇసుక దందా
- కృష్ణ, మాగనూరు పెద్దవాగులో తవ్వకాలు
- చీకటి పడిందంటే వాహనాల బారులు
- నిత్యం 20 నుంచి 30 టిప్పర్లలో రవాణా
- సమాచారమిచ్చినా స్పందించని తాసీల్దార్లు
- రోడ్లపై బాజాప్తా వెళ్తున్నా పట్టించుకోని పోలీసులు
- అధికారుల కనుసన్నల్లోనే దందా అంటూ రైతుల ఆరోపణలు

ఇసుకాసురులు!



ముడుమాల్‌లో రాత్రివేళల్లో ఇసుకను అక్రమంగా ట్రిప్పర్లలో నింపుతున్న జేసీబీ

గురకొండ వాగులో జేసీబీ ద్వారా ట్రాక్టర్లలో ఇసుక నింపుతున్న దృశ్యం

వర్కూర్ రీచ్‌లో రాత్రి వేళలో టిప్పర్‌లోకి ఇసుక నింపుతున్న జేసీబీ

నారాయణపేట జిల్లా మాగనూరు, కృష్ణ, మరికల్ మండలాల్లో ఇసుక అక్రమ రవాణా నిత్యం రాత్రి అయితే చాలు మూడు పువ్వులు ఆరు కాయలుగా విరాజిల్లుతున్నది. మాగనూరు పెద్ద వాగు, కృష్ణానదిలో నుంచి పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా టిప్పర్ల ద్వారా తరలిస్తుండడంతో ఇసుక అక్రమ రవాణాను ఆపేది ఎవరంటూ ప్రజల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి. మాగనూరు మండలం పరిధిలోని దాసరిదొడ్డి, వర్కూర్ రీచ్‌ల ద్వారా ఆన్‌లైన్ పర్మిషన్ల పేరుతో పట్టపగలు ఇష్టానుసారంగా ట్రాక్టర్ల ద్వారా గుర్తించిన రీచ్ల దగ్గరలో డంపు వేసి రాత్రి అయితే చాలు 20నుంచి 30టిప్పర్ల ద్వారా మక్తల్ ఎమ్మెల్యే అనుచరులు ముఖ్య నాయకులు అంతా కలిసి మక్తల్ పోలీస్, రెవెన్యూ అధికారుల చేతులు తడుపుతూ టిప్పర్ల ద్వారా అక్రమంగా ఇసుక మహబూబ్‌నగర్, గద్వాల్, నారాయణపేట, మరికల్, దేవరకద్ర వైపు తరలిస్తున్నారని మాగనూరు, మక్తల్ మండలాల ప్రజ లు ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉండగా కృష్ణ మండ ల పరీవాహక ప్రాంతమైన ముడుమాల్, మురారిదొడ్డి గ్రామ సమీపంలోని కృష్ణానదిలో నుంచి రాత్రి 7 అయితే చాలు ఇసుక అక్రమ రవాణా జోరుగా సంబంధిత పోలీస్ రెవెన్యూ అధికారుల కనుసన్నల్లోనే కొనసాగుతున్నట్లు తెలుస్తున్నది. ఏకంగా జేసీబీ, హిటాచీల ద్వారా కర్ణాటక రాష్ట్రానికి చెందిన 10నుంచి 20సంఖ్యలో 12టైర్ల టి ప్పర్ల ద్వారా నిత్యం కర్ణాటక రాష్ట్రానికి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. ఇక్కడ కూడా ఎమ్మె ల్యే అనుచరులే ఉన్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

మరికల్ మండలంలో జోరుగా..

మరికల్ మండలంలోని రాకొండ గ్రామంలోని ఊకచెట్టు వాగు నుంచి ఇసుక అక్రమ రవాణా జోరుగా కొనసాగుతున్నది. ఈ చీకటి వ్యాపారానికి నారాయణపేట ఎమ్మెల్యే బంధువు హస్తం ఉన్నట్లు జోరుగా ప్రచారం సాగుతున్నది. ఈ వాగు నుంచి నిత్యం అక్రమంగా ఇసుక రవాణా మహబూబ్‌నగర్, హైదరాబాద్ ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఒక్క భారత్ బెంచ్‌కు ముఖ్య నాయకుడి అనాధికార పీఏకు పదివేల రూపాయలు ముట్ట చెప్పాల్సి ఉంటుందని, అలా ముట్ట చెబితేనే ఇసుక అక్రమ రవాణా కొనసాగుతుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ చీకటి వ్యాపారానికి పోలీస్ అధికారుల సహకారాలు కూడా ఉన్నట్టు జోరుగా ప్రచారం జరుగుతున్నది. స్థానికంగా ఉన్న పోలీసు, రెవెన్యూ అధికారులు ఇసుక అక్రమ రవాణా అడ్డుకట్టుకు ప్రయత్నించినా జిల్లాస్థాయి నుంచి వచ్చే ఒత్తిళ్లకు తలోగ్గుతున్నట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. ఏదేవైనా నారాయణపేట జిల్లాలో కాంగ్రెస్ నాయకులు అక్రమ దందాలపై భారీగా వసూళ్ల పర్వం చేపట్టినట్లు ప్రచారం జరుగుతుంది.

టీబీ డ్యాం ద్వారా తుంగభద్ర నదిలోకి చేరుతున్న నీరు

ఆర్డీఎస్ ఆనకట్టకు తుంగభద్ర నీళ్లు

- 26నుంచి జనవరి 5 వరకు టీబీ డ్యాం నుంచి విడుదల
- పదిరోజుల పాటు 1.078 టీఎంసీల నీరు
- నేడు ఆనకట్టకు చేరే అవకాశం

అయిజ, డిసెంబర్ 27 : ఆర్డీఎస్ ప్రాజెక్టు పరిధిలో యాసంగిలో సాగు చేసిన పంటలకు నీటి లభ్యత తగ్గుతుండటంతో గురువారం కర్ణాటకలోని తుంగభద్ర జలాశయం 1,500 క్యూసెక్కుల నీటిని తుంగభద్ర బోర్డు అధికారులు దిగువకు విడుదల చేశారు. 2024-25 ఏడాదికి గానూ ఆర్డీఎస్ ప్రాజెక్టుకు కేటాయించిన 5.896 టీఎంసీల నీటి వాటా నుంచి టీబీ బోర్డు అధికారులు నీరు విడుదల చేశారు. పదిరోజుల పాటు 1.078 టీఎంసీ నీటిని టీబీ డ్యాం నుంచి విడుదల చేయాలని తెలంగాణ రాష్ట్ర జలవనరుల శాఖ టీబీ బోర్డు కార్యదర్శి నాగమోహన్ ఈ నెల 26న ఇండెంట్ పెట్టారు. దీంతో టీబీ బోర్డు అధికారులు డ్యాం నుంచి తుంగభద్ర నదిలోకి నీటిని విడుదల చేశారు. మొదటి ఐదు రోజులు 1500 క్యూసెక్కులు, చివరి ఐదు రోజులు వెయ్యి క్యూసెక్కుల చొప్పున డ్యాం నుంచి విడుదల చేస్తారు. శనివారం నాటికి కర్ణాటకలోని ఆర్డీఎస్ ఆనకట్ట (రాజోళిబండ డైవర్సన్ స్కీం)కు చేరుకుంటుందని ఆర్డీఎస్ ప్రాజెక్టు ఈఈ శ్రీనివాస్ తెలిపారు. ఈ ఏడాది ఐఏబీ సమావేశంలో ఆర్డీఎస్ ప్రాజెక్టు పరిధిలో 37వేల ఎకరాలకు ఆరుతడి పంటలకు సాగునీరు అందించాలని నిర్ణయం తీసుకుందని, అందుకనుగుణం గా నీటి విడుదలకు చర్యలు చేపట్టామని ఆయన వివరించారు.

తల్లి కర్కశత్వం

- పసికందును వదిలిలేసి వెళ్లిన వైనం
- నవాబ్‌పేట మండలం రుద్రారంలో ఘటన

నవాబ్‌పేట, డిసెంబర్ 27 : తన సొంత బిడ్డ(9నెలల పసికందు)ను వదిలి ఓ తల్లి ఇంట్లో నుంచి వెళ్లిపోయిన ఘటన మండలంలో గురువారం రాత్రి చోటు చేసుకున్నది. ఎస్సై విక్రమ్ కథనం మేరకు.. రుద్రారం గ్రామానికి చెందిన ఈసూరి సత్యనారాయణకు ఫరూక్‌నగర్ మండలం ఎలికట్ట గ్రామానికి చెందిన అనిత అలియాస్ దీపిక(22)తో మూడేండ్ల కిందట వివాహం జరిగింది. వీరికి ఏడాదిన్నర కుమారుడు, 9 నెలల పాప ఉన్నది. మూడ్రోజుల కిందట స్నేహితులతో కలిసి సత్యనారాయణ శబరికి దైవదర్శనానికి వెళ్లాడు. ఇదే అదునుగా భావించి గురువారం రాత్రి 10 గంటల తర్వాత ఇద్దరు పసి పిల్లలను వదిలి పరారైనట్లు ఎస్సై తెలిపారు. చిన్నారుల రోధనలు విన్న ఆమె అత్తతోపాటు ఇరుగు.. పొరుగు వారు దీపిక కోసం వెతకగా ఎంతకీ ఆచూకీ లభించలేదు. తర్వాత ఈ విషయాన్ని సత్యనారాయణకు తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. పసికందులను వదిలి ఆమె పారిపోవడానికి మనసెలా వచ్చిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

బోనాలతో బైలెల్లి..

- ఎస్ఎస్ఏ ఉద్యోగుల నిరసన
- కొనసాగుతున్న సమ్మె

గద్వాలలో బోనాలతో నిరసన తెలుపుతున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

ఉమ్మడి పాలమూరు జిల్లాలో సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల సమ్మె కొనసాగుతోంది. శుక్రవారం జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో వినూత్నంగా నిరసన చేపట్టారు. మహిళా ఉద్యోగులు బోనాలు ఎత్తి ర్యాలీ చేపట్టారు. సుంకులమ్మ ఆలయానికి సమర్పించి తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని వేడుకున్నారు. అలాగే వనపర్తి, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, నారాయణపేటలో నిరసనలు తెలిపారు.

– నెట్‌వర్క్ మహబూబ్‌నగర్, డిసెంబర్ 27

మన్మోహన్‌సింగ్ మృతి

దేశానికి తీరనిలోటు

- మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం

మక్తల్, డిసెంబర్ 27 : మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్‌సింగ్ మృతి ఎంతో బాధాకరం అని మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మక్తల్‌లోని ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ 2004 నుంచి 2014 వరకు భారత దేశ ప్రధానిగా సేవలందించి ఆర్థికరంగంలో అనేక విజయాలు సాధించిన గొప్పవ్యక్తి అని పేర్కొన్నారు. అలాంటి మహోన్నత వ్యక్తిని కోల్పోవడం దేశానికి తీరనిలోటని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుకు ఆయన పూర్తిగా సహకరించాలని, తెలంగాణ ప్రజలు ఆయనకు రుణపడి ఉంటారన్నారు. బీఆర్ఎస్ తరపున ఆయనకు నివాళులర్పించడంతోపాటు ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి, సంతాపాన్ని వ్యక్తం చేస్తున్నట్లు ప్రకటించారు.

జీపీ కార్మికుల ఆందోళనబాట

- సమస్యలు పరిష్కరించాలని ఉమ్మడి పాలమూరు జిల్లాలో ధర్నాలు

మహబూబ్‌నగర్‌లో టోకెన్ సమ్మె నిర్వహిస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు

గ్రామ పంచాయతీ కార్మికులు ఆందోళనకు దిగారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలో భాగంగా జీపీ వ ర్కర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. శుక్రవారం ఉమ్మడి జిల్లాలోని మహబూబ్‌నగర్, మక్తల్, నారాయణపేట, వనపర్తిలో టోకెన్ సమ్మెలో భాగంగా ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా పలువురు కార్మిక సంఘం నాయకులు మాట్లాడుతూ జీవో 60 మేర కు వేతనాలు పెంచి అందించాలన్నా రు. ప్రత్యేక బడ్జెట్‌ను ప్రకటించడంతో మల్టీ పర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేసి, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే నిరవధిక సమ్మెకు దిగుతామని తెలంగాణ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ నాయకులు హెచ్చరించారు.

– నెట్‌వర్క్ మహబూబ్‌నగర్, డిసెంబర్ 27

అట్టహాసంగా..

- రాష్ట్రస్థాయి కబడ్డీ టోర్నీ ప్రారంభం
- పోటీలకు 33జిల్లాల జట్లు

మహబూబ్‌నగర్ అర్బన్, డిసెంబర్ 27 : జిల్లా కేంద్రంలోని క్రీడా మైదానంలోని ఇండోర్‌లో శుక్రవారం రాష్ట్రస్థాయి సీఎం కప్ కబడ్డీ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను డీవైఎస్‌వో శ్రీనివాస్, క్రీడా సంఘాల నాయకులతో కలిసి ప్రారంభించారు. అంతకుముందు మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం డీవైఎస్‌వో శ్రీనివాస్ మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించి క్రీడాస్ఫూర్తిని చాటడం వల్ల మరింత ఉన్నత స్థాయి ఎదిగే అవకాశం ఉందన్నారు. పోటీలకు వచ్చిన క్రీడాకారులందరికీ ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు పూర్తి చేశామని ఆయన వివరించారు. కార్యక్రమంలో క్రీడా సంఘాల నాయకులు విలియం, జగన్‌మోహన్‌గౌడ్, బాలరాజు, వేణుగోపాల్, వడెన్న, గజానంద్, నిరంజన్, చెన్నవీరయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

తొలిరోజు ఫలితాలు..

బాలుర విభాగంలో రంగారెడ్డి జట్టు 45-32 పాయింట్స్ తేడాతో మేడ్చల్‌పై, కొత్తగూడెం జట్టు 23-16 తేడాతో సూర్యపేట జట్టుపై, నల్లగొండ జట్టు 35-15 తేడాతో సిరిసిల్ల జట్టుపై, గద్వాల జట్టు 44-15 తేడాతో నిర్మల్ జట్టుపై, నాగర్‌కర్నూల్ జట్టు 28-17 తేడాతో జగిత్యాల జట్టుపై, హైదరాబాద్ జట్టు 41-15 తేడాతో కామారెడ్డి జట్టుపై, కరీంనగర్ జట్టు 27-11తేడాతో వరంగల్ జట్టుపై, ములుగు జట్టు 48-26 తేడాతో మెదక్ జట్టుపై, వనపర్తి జట్టు 38-10 తేడాతో మహబూబ్‌నగర్ జట్టుపై, నిజామాబాద్ జట్టు 24-15 పాయింట్స్ తేడాతో భూపాలపల్లి జట్టుపై విజయం సాధించాయి. బాలికల విభాగంలోనూ నల్లగొండ జట్టు 70-18 పాయింట్స్ తేడాతో నిజామాబాద్ జట్టుపై, రంగారెడ్డి జట్టు 50-07 తేడాతో సిద్దిపేట జట్టుపై, హైదరాబాద్ 49-18 తేడాతో నారాయణపేట్ జట్టుపై, మహబూబాబాద్ జట్టు 30-26 తేడాతో ఖమ్మం జట్టుపై, గద్వాల జట్టు 55-12 తేడాతో భువనగిరిపై, మహబూబ్‌నగర్ జట్టు 57-09 తేడాతో ఆదిలాబాద్ జట్టుపై, సంగారెడ్డి జట్టు 50-10 తేడాతో పెద్దపల్లి జట్టుపై, నాగర్‌కర్నూల్ 41-04 తేడాతో మెదక్ జట్టుపై, మేడ్చల్ జట్టు 34-20 తేడాతో కామారెడ్డి జట్టుపై విజయం సాధించాయి.

శుభారంభం చేసిన ఉమ్మడి పాలమూరు జట్లు

ఉమ్మడి పాలమూరు జట్లు మొదటి రోజు శుభారంభం చేశాయి. బాలికల విభాగంలో మహబూబ్‌నగర్ జట్టు-ఆదిలాబాద్ జట్టుపై, గద్వాల జట్టు - భువనగిరిపై, నాగర్‌కర్నూల్ జట్టు – మెదక్ జట్టుపై, బాలుర విభాగంలో గద్వాల జట్టు - నిర్మల్ జట్టుపై, నాగర్‌కర్నూల్ జట్టు - జగిత్యాల్ జట్టుపై, వనపర్తి జట్టు - మహబూబ్‌నగర్ జట్టుపై విజయం సాధించాయి.

మహబూబ్‌నగర్ – ఆదిలాబాద్ జట్ల మధ్య కొనసాగుతున్న మ్యాచ్

కోర్టు కాంప్లెక్స్ నిర్మాణంపై నీలినీడలు

- గతంలో పూడూరు శివారులో కోర్టు కాంప్లెక్స్ నిర్మాణానికి ఒప్పుకున్న న్యాయవాదులు
- ప్రస్తుతం పీజేపీ క్యాంప్ ఆవరణలో నిర్మించాలని డిమాండ్
- కొన్ని రోజులుగా విధులు బహిష్కరించి దీక్ష చేపట్టిన లాయర్లు
- ఇబ్బందులు పడుతున్న వివిధ కేసుల కక్షిదారులు
- మార్చడం కుదరదంటున్న అధికారులు
- భిన్నాభిప్రాయాలతో వచ్చిన నిధులు వెనక్కి వెళ్లే అవకాశం

గద్వాల కోర్టు ఎదుట రిలే దీక్షలు చేపట్టిన న్యాయవాదులు(ఫైల్)

గద్వాల, డిసెంబర్ 27 : న్యాయవాదుల భిన్నాభిప్రాయాలతో జిల్లా ఇంటిగ్రేటెడ్ కోర్టు కాంప్లెక్స్ నిర్మాణానికి అవాంతరాలు ఏర్పడుతున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కోర్టు కాంప్లెక్స్ నిర్మాణానికి అనుమతి ఇచ్చింది. అయితే అప్పుడు పూడురు శివారులో కోర్టు కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రభుత్వం పదేకరాల స్థలం కేటాయించింది. అప్పుడే కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రభుత్వం సుమారు రూ.91 కోట్లు కేటాయించింది. ప్రస్తుతం ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్ కోర్టుకు శంకుస్థాపన జరిగే క్రమంలో స్థల విషయంపై న్యాయవాదులు రెండు వర్గాలుగా విడిపోవడంతో కోర్టు నిర్మాణ శంకుస్థాపనపై నీలినీడలు కమ్ముకున్నాయి. గతంలో పూడురు శివారులో 368 సర్వే నెంబర్‌లో పదే ఎకరాలు కోర్టు కాంప్లెక్స్ నిర్మాణానికి కేటాయించిన సమయంలో న్యాయవాదులు అంగీకరించిన తర్వాత ఉన్నతాధికారులకు పంపారు. ప్రస్తుతం అక్కడ ఏర్పాటు చేస్తే ఇబ్బందులు కలుగుతాయని కోర్టు కాంప్లెక్స్ నిర్మాణానికి పీజేపీ ఆవరణలో ఉన్న స్థలం కేటాయించాలని న్యాయవాదులు కోరుతున్నారు. అప్పుడు అందరి అంగీకారంతో ఆ స్థలం అంగీకరించినట్లు తెలిపారు. ప్రస్తుతం ఆ స్థలానికి న్యాయవాదులు నో అనడంతోపాటు వారి మధ్య ఉన్న భిన్నాభిప్రాయాల కారణంగా న్యాయవాదులు రెండు వర్గాలుగా విడిపోయారు. విధులు బహిష్కరించి రిలే దీక్షకు పూనుకోవడంతో పలు కేసుల్లో కోర్టుకు వస్తున్న కక్షిదారులు ఇబ్బందులు పడుతున్నారు.

బీఆర్ఎస్ హయాంలో ప్రభుత్వం పూడురు శివారులోని పుటాన్‌పల్లి వద్ద కోర్టు కాంప్లెక్స్ నిర్మాణానికి స్థలం కేటాయిస్తే తమకు అనుకూలంగా ఉందని అప్పటి బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు ప్రదీప్‌కుమార్, కార్యదర్శి శ్రీధర్ అందరీ న్యాయవాదుల సమక్షంలో అప్పటి కలెక్టర్ శృతిఓజాను ఒప్పించి 2019-20లో పదెకరాల భూ కేటాయింపులు చేశారు. 2023-24లో అప్పటి బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు శోభారాణి ఉన్న సమయంలో ఇక్కడ జిల్లా జడ్జిగా పనిచేస్తున్న కనకదుర్గ ప్రభుత్వం కేటాయించిన భూమిని కోర్టుకు అప్పగించింది. అయితే ప్రస్తుతం న్యాయవాదులు పుటాన్‌పల్లి వద్ద కోర్టు కాంప్లెక్స్ నిర్మాణాలు చేపడితే కక్షిదారులు, న్యాయవాదులు, అధికారులకు ఇబ్బందులు కలుగుతాయని అక్కడ కోర్టు కాంప్లెక్స్ నిర్మాణం వద్దంటూ బార్‌సోసియేషన్‌లోని కొందరు న్యాయవాదులు కోరుతున్నారు. మరికొంత మంది న్యాయవాదులు ఇంటిగ్రేటెడ్ కోర్టు కాంప్లెక్స్ నిర్మాణాన్ని గతంలో చూపిన స్థలంలోనే చేపట్టాలని మరో వర్గం వాదిస్తుంది. దీంతో ఇంటిగ్రేటెడ్ జిల్లా కోర్టు కాంప్లెక్స్ నిర్మాణంపై సందిగ్ధత నెలకొంది.

జిల్లా ఏర్పాటుతో అదనపు కోర్టులు

తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2016లో నూతన జిల్లాలను ఏర్పాటు చేసింది. జిల్లా ఏర్పాటుకాక ముందు గద్వాలలో మూడో అదనపు జిల్లా కోర్టు, సబ్‌కోర్టు, మున్సిఫ్ కోర్టులుండేవి. జిల్లా ఏర్పాటైనా తర్వాత కొత్తగా ఆరు కోర్టులు జిల్లాకు అదనంగా వచ్చాయి. అందులో జిల్లా కోర్టు, అదనపు సబ్‌కోర్టు, స్పెషల్‌ఫాస్ట్రాక్, రేప్ అండ్ పోక్సో కోర్టు, అడిషనల్ మున్సిఫ్ కోర్టు, జువైనైల్ బోర్డు, జిల్లా లీగల్‌సెల్ అథారిటీ కోర్టులు వచ్చాయి. వీటితోపాటు జిల్లాకు మరిన్ని కోర్టులు వచ్చే అవకాశం ఉంది. వీటిలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కోర్టు, వినియోగదారుల ఫోరం కోర్టు, ఫ్యామీలి కోర్టు, మోటర్ వెహికిల్ యాక్సిడెంట్ కోర్టు, ఎక్సైజ్ కోర్టు, ఏసీబీ కోర్టుతోపాటు పలు కోర్టులు వచ్చే అవకాశం ఉన్నది. దీంతో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని కోర్టు కాంప్లెక్స్ నిర్మాణానికి పుటాన్‌పల్లి స్టేజీ సమీపంలో అప్పటి ప్రభుత్వం స్థలం కేటాయించింది. అయితే దీనిని బార్ అసోసియేషన్‌లో ఉన్న న్యాయవాదులు కొందరు స్వాగతిస్తుండగా మరి కొందరు దీనిని వ్యతిరేకిస్తున్నారు.

జిల్లా అభివృద్ధి చెందాలంటే..

జిల్లా అభివృద్ధి చెందాలంటే జిల్లా నలుమూలల వివిధ రకాల కార్యాలయాల ఏర్పాటు తప్పనిసరి. రాబోవు కాలంలో జనాభా పెరిగితే జనాభాకు అనుగుణంగా అన్ని సౌకర్యాలు ఉంటేనే జిల్లా అభివృద్ధి చెందడానికి అవకాశం ఉంటుంది. జిల్లా చుట్టుపక్కల వివిధ కార్యాలయాలు ఏర్పాటైతే పేదలకు ఉపాధి అవకాశాలు దొరకడంతో పాటు వివిధ రంగాలు అభివృద్ధి చెందడానికి అవకాశం ఉంటుంది. ఒక రంగం అభివృద్ధి చెందితే దానిపై పది రకాల ఆదాయ మార్గాలు ప్రజలకు లభించే అవకాశం ఉంటుంది. జిల్లా అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని అయిజ రహదారిలో పరుమాల శివారులో డబుల్‌బెడ్రూం ఇండ్ల తోపాటు నర్సింగ్, మెడికల్ కళాశాల, జిల్లా దవాఖాన అక్కడ ఏర్పాటు చేస్తున్నారు. జూరాలకు వెళ్లే దారిలో ఐటీఐ కళాశాల, కర్నూల్ వెళ్లే రహదారిలో కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఆ దిశగా గత ప్రభుత్వం ఆలోచించి కర్నూల్‌కు వెళ్లే రహదారి సమీపంలో కోర్టు కాంప్లెక్స్‌కు స్థలం కేటాయించినట్లు తెలుస్తుంది. జిల్లా అభివృద్ధి చెందాలంటే అన్ని దిక్కులా కార్యాలయాలు ఏర్పాటైతే బాగుంటుందని మేధావులు అభిప్రాయపడుతున్నారు.

కోర్టు కాంప్లెక్స్‌కు స్థలం కేటాయించాలి

గతంలో కేటాయించిన స్థలం గద్వాల జిల్లా కేంద్రానికి దూరంగా ఉండడంతోపాటు జములమ్మ ఉత్సవాల సమయంలో నాలుగు నెలల పాటు రాకపోకలకు అడ్డంకులు కలుగుతాయని దీంతో కక్షిదారులతోపాటు అధికారులు, న్యాయవాదులు ఇబ్బందులు పడతారని అక్కడ కోర్టు కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టకుండా పీజేపీ క్యాంప్ ఆవరణలో మిగిలి ఉన్న స్థలం కేటాయించాలని డిమాండ్ చేస్తూ గత పది రోజులుగా న్యాయవాదులు విధులు బహిష్కరించి రిలే దీక్షలు చేపట్టారు.

శంకుస్థాపనపై అయోమయం..

జిల్లా ఇంటిగ్రేటెడ్ కోర్టు కాంప్లెక్స్ నిర్మాణానికి సంబంధించి 2025 జనవరిలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని కోర్టుల నిర్మాణాలకు ఒకే సారి శంకుస్థాపన చేయనున్నట్లు తెలిసింది. అయితే గద్వాల బార్‌అసోసియేషన్ న్యాయవాదుల మధ్య నెలకొన్న భిన్నాభిప్రాయాల కారణంగా శంకుస్థాపన నిలిచిపోయే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. ఒక వేళ శంకుస్థాపన కార్యక్రమం నిలిచి పోతే కోర్టు కాంప్లెక్స్ నిర్మాణానికి వచ్చిన నిధులు వెనక్కి పోయే ప్రమాదం ఉన్నది. ఏది ఏమైనా న్యాయవాదులు అందరూ ఒక ఏకాభిప్రాయానికి వచ్చి అటు కక్షిదారులకు, న్యాయవాదులకు, అధికారులకు అందరికీ అనుకూలంగా, ఆమోదయోగ్యంగా ఉండే స్థలాన్ని ఎంపిక చేసుకుంటే అన్ని వర్గాలకు మేలు జరిగే అవకాశం ఉంది. ఆ దిశగా మేధావులైనా న్యాయవాదులు ఆలోచించాల్సిన అవసరంతోపాటు జిల్లా అభివృద్ధికి వారి సలహాలు, సూచనలు ఎంతైనా అవసరం.